# కాశీగుఱ్ఱం

పైడిపాల

'సీతాపతి సుబ్బలక్ష్మిని ప్రేమించాట్ట. పెళ్ళి చేసుకుంటాడట కూడా—' ఈ వార్త కాలేజీ అంతా క్షణాలమీద పాకి పోయింది. విన్నవాళ్ళంతా విడ్డూరంగా చెప్పుకున్నారు. 'సర్వరాజ్య లక్షణాలూ కలిగిన తెలుగు సిన్మా హీరోలాంటి సీతాపతికి, సన్నజాజి తీగల్లాంటి అమ్మాయిలు కాలేజీలో అనేకమంది వుండగా ఈ 'కాశీగుర్రం'మీద కన్నెలా పడిందా?' అని —అదే నేనూ ఆశ్చర్యపోయాను.

*  *  *

ఆ రోజు నేను క్లాసులోకి వెళ్ళేసరికి బోర్డుమీద 'కాశీగుర్రం' అనే పెద్దపెద్ద అక్షరాలు కనిపించాయి. ఓ క్షణం కంగారుపడి ఆ తర్వాత ఎలాగో నిభాయించుకొన్నాను. ఆ అక్షరాలు ఎవర్రాశారో చెప్పమని నిలదీసి అడిగాను. క్లాసంతా ముక్త కంఠంతో తమకు తెలియదన్నారు. పైగా ఆ సెక్షన్ ఆ రూమ్‌కి ఆ గంటలోనే వచ్చారుట. అంచేత ముందు సెక్షన్‌వాళ్ళు రాసుండొచ్చు అని కూడా సూచించారు. దాంతో 'మీ ఐకమత్యానికి జోహారు' అనుకొని, పైకి మాత్రం 'నిజం చెపితే విడిచిపెట్టేస్తాను. మీ కాంపోజిషన్ పుస్తకాలు మా దగ్గరున్నాయని మర్చిపోకండి. అవి చూస్తే ఈ రాత ఎవరిదో పోల్చడం పెద్ద కష్టం కాదు. అంతవరకు వస్తే మాత్రం చిక్కుల్లో పడతారు. ఆలోచించుకోండి' అంటూ హెచ్చరించి పాఠం మొదలు పెట్టాను.

పాఠం చెప్తున్నా. మధ్య మధ్య ఆలోచనలు. ఈ 'కాశీగుర్రం' ఎవరికి పెట్టిన పేరు? కొంపదీసి నాకు కాని కాదు గదా? అదే నా భయం. ఒకసారి పేరు పెడితే ఈ కాలేజి విడిచిపెట్టేంతవరకు అది పోదు. కామర్సు సుబ్బారావుగార్కి— మూర్తివాళ్ళ సీనియర్సే ప్రదానం చేశారట 'ఉల్లిదోసె' అనే నిక్‌నేమ్. ఆయన హోటల్లో ఎప్పుడూ ఉల్లిదోసే తినడం కుర్రాళ్ళెవరో చూశారట. మూర్తి ఇప్పుడు అదే కాలేజీలో లెక్చరర్‌గా నాతోనే అపాయింటయ్యాడు. ఈ కాలేజి గురించి బాగా తెలిసిన వాడు గనుక ఉద్యోగ మొచ్చిన కొత్తలో సిన్మా పోస్టర్ల వంక చూసినా, కిళ్ళీ బడ్డీల దగ్గర, బుక్ స్టాల్స్ దగ్గర ఆగినా చీవాట్లు పెట్టేవాడు మూర్తి. ఆ రెండుమూడు నెలలు సిన్మా హాళ్ళలోనూ, హోటళ్ళలోనూ స్టూడెంట్సు ఎక్కడ కనిపిస్తారో అని పోలీసుల్ని చూసి భయపడే దొంగల్లాగ దూరేవాళ్ళం. మొత్తానికి మా స్టూడెంట్సు దయవల్లో, నా కలుపుగోలుతనంవల్లో 'బ్రాండ్' బారి పడకుండా బయటపడి ఈ మూడేళ్ళు నెట్టు

కొచ్చాను. 'ఇక ఫర్వాలేదు. పాతబడ్డాను' అనుకుంటున్న సమయంలో ఈ 'నిక్ నేమ్' ఏమిటి? అని నా ఆందోళన.

'బెల్' కొట్టగానే అమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాను. ఆ పేరు నాకు పెట్టడానికి ఆస్కారం కనిపించదు. కుర్రాళ్ళ కిలాంటి విషయాల్లో మాత్రం అమోఘమైన సమయస్ఫూర్తి వుంటుంది. ఒకసారి ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థులు ఎక్జిబిషన్ ఏర్పాటుచేసి ద్వారం దగ్గర డబ్బీమీద 'త్యాగరాజస్వామి హుండీ' అని రాశారు. అప్పట్నుంచి ఇలాంటి విషయాల్లో స్టూడెంట్సు తెలివిని శంకించడం మానేశాను. ఇంతవరకు గోడలమీద, బెంచీలమీద, దూలాలమీద 'బొచ్చు కుక్క', 'గానపెసూనాంబ', 'ఉల్లిదోసె', 'మన్మధుడు' మొదలైన పేర్లు మాత్రం కనిపించేవి. ముద్దుగా, బొద్దుగా వున్న ప్లీడరుగారి అమ్మాయిని చూసి ముచ్చట పడి 'బొచ్చుకుక్క' అనీ, బాగా పాటలు పాడే అందమైన 'కల్పన'కి 'గానపెసూనాంబ' అనీ పేర్లు పెట్టారట. ఉన్న లెక్చరర్లందరిలోనూ అందవికారంగా వుండే 'వెంకటేశం'గార్కి ఆయన బోరు భరించ లేక అమ్మాయిలే 'మన్మధుడు' అనే అందమైన పేరు తగిలించేశారట. ఆలోచిస్తూ అడుగులేస్తున్న నన్ను మేడమెట్ల పక్కనే వున్న 'లేడీస్ వెయిటింగ్ రూమ్' గోడమీద అక్షరాలు ఆకర్షించాయి.

కాశీగుర్రాన్ని ము.... ట్టుకుంటే తన్నునా?

కాశీగుర్రాన్నెక్కి....

చదవలేకపోయాను. విద్యార్థుల కుసంస్కారాన్ని చూసి సిగ్గుపడిపోయాను.


స్టాఫ్ రూంలోకి వెళ్ళిన తర్వాత ఇద్దరు ముగ్గుర్ని అడిగాను. ఈ కాశీ గుర్రం ఎవరని?— పేరయితే వారం రోజుల్నుంచి చూస్తున్నారటగాని ఎవరో వాళ్ళకీ తెలియదట. ఆ తర్వాత బోర్డుమీద రాసిన అక్షరాల గురించి ప్రిన్సిపాల్‌గారితో చెప్పాను. 'ఈమాత్రందానికి ఎందుకొచ్చిన గొడవలెద్దురూ? చూసీచూడనట్టు పొండి. అఫ్‌కోర్స్! మీ ఉడుకురక్తం సహించదనుకోండి' అంటూ చన్నీళ్ళు చల్లేశారు.

తర్వాత ఓ రోజు హాఫియర్లీ పరీక్షల్లో రూమ్ నెం. 22కి ఇన్విజలేటరుగా వెళ్ళాను. గంటన్నర 'లైసెన్స్ బెల్' ఇవ్వడంతో మెజారిటీ లేచి వెళ్ళిపోయారు. ఒకళ్ళిద్దరు బుద్ధిమంతులు మాత్రం చివరి వరకు రాస్తున్నారు. ఏం లోచక అటూ ఇటూ తిరుగుతున్న నన్ను 'బెంచి సాహిత్యం' ఆకర్షించింది. కొన్ని చదవలేనంత అసభ్యంగా వుంటే మరికొన్ని చదువుకొని నవ్వుకొనేలా వున్నాయి. ఎక్కువగా బెంచీలనిండా విడుదలవుతున్న కొత్త చిత్రాల గురించి పబ్లిసిటీ. సిన్మా ప్రొడ్యూసర్లనీ, డిస్ట్రిబ్యూటర్లనీ తీసుకొచ్చి ఈ పబ్లిసిటీ చూపిస్తే కాలేజీకి కొంత గ్రాంటయినా ఇస్తారేమో అనిపించింది.

ఓ బెంచీమీద ఓ విచిత్రమైన ప్రకటన—

K.K.C. ప్రొడక్షన్స్‌వారి (కాసూలిమ్మ కనకయ్యశెట్టి కాలేజి).

ఒరిజినల్ కురుక్షేత్ర ప్రదర్శనం!




కాశీగుర్రం (ఈస్ట్‌మన్‌కలర్ సాంఘిక చిత్రం).

నిర్మాత, దర్శకుడు : ధృతరాష్ట్రుడు (కేవలం చెప్పుడుమాటలే వినే వెంకట శెట్టి అనబడే ప్రిన్సిపాల్‌గారి నిక్‌నేమ్.)

హీరోహీరోయిన్లు : సీతాపతీ సుబ్బ లక్ష్మి.

మాటలు, పాటలు, కెమేరా, సంగీతం మొదలైన శాఖలకు కాలేజీ సాంస్కృతిక కార్యక్రమాల్ని నిర్వహించే లెక్చరర్ల పేర్లను పొడి అక్షరాల్లో రాశారు (ఎబ్రీవియేషన్స్).

అప్పుడు తెలిసింది కాశీగుర్రం అంటే సుబ్బలక్ష్మి అనే అమ్మాయని.

ఆ తర్వాత తెలిసింది సుబ్బలక్ష్మి జూనియర్ ఇంటర్ 'డి' సెక్షన్‌లో వుందనీ, నా స్టూడెంటేననీ!

* * *

అయితే ఇది నిప్పున్న పొగేనన్న మాట. స్టూడెంట్స్ బెంచి శాసనాన్ని చూసినప్పుడు సీతాపతి అందగాడు గనుక అతని పక్కన సరిపోయే గ్లామరున్న అమ్మాయి పేరేదో రాశారనుకున్నాను గాని తెరవెనుక మరో కథ వుందనుకోలేదు.


కాని సుబ్బలక్ష్మిని చూసిన తర్వాత ఆ వూహ పొరపాటని తేలింది. అమ్మాయిల వరసలో ఆఖరి బెంచీలో కూర్చుంటుంది సుబ్బలక్ష్మి. భారీ విగ్రహం కనుక ఇబ్బందిలేకుండా చివర కూర్చుంటుందేమో అనుకున్నాను. ఆ తర్వాత రెండు మూడు రోజులు వరసగా కావాలని ప్రశ్న

లడిగాను. ఆ స్థూలకాయాన్ని మెల్లగా కదిలించి లేచేసరికి అయిదు నిమిషా లయినా పట్టేది. ఆ అమ్మాయి నడుగు తున్నప్పుడల్లా అబ్బాయిలంతా గొల్లుమనే వారు. మరి వాళ్ళకి భయపడే చెప్పేది కాదో, రాకనే చెప్పేదికాదో—లేచి ఓ చిరు నవ్వు నవ్వేసి తలొంచుకుని చూపుడు వేలుతో కూచోమనేవరకు బెంచిమీద ముగ్గులెడుతూ నిల్చొనేది. ఇక ఈ అమ్మా యిని కదిలిస్తే ఏం ప్రమాదమొస్తుందో నని ప్రశ్నలడగడం మానేశా. సుబ్బలక్ష్మి అనాకారి మాత్రం కాదు. అయితే ఆరడు గుల పొడవున్న ఖాకీ విగ్రహం—మగా డెక్కడ దొడుకుతాడా అనుకునేవాణ్ణి, సదరు అమ్మాయే సుబ్బలక్ష్మి అని తెలి యక మునుపు.

కానీ ఆ మగమహారాజుగా సీతాపతి ముందుకి రావడం ఆశ్చర్యం? సీతాపతీ నేనూ ఆ కాలేజిలో ఒక్కమాఁనే ఉద్యో గంలో చేరాం. కాకపోతే సీతాపతి కామర్సు లెక్చరరు. అయినా బ్రహ్మచారిగాళ్ళం కనుక సీతాపతికీ నాకూ దోస్తీ యెక్కువ. సీతాపతిని మా కాలేజీలో వున్న లెక్చ రర్లలో మంచి పెర్సనాలిటీ అని చెప్పు కోవాలి. వెనకవున్న ఆస్తిపాస్తుల గురించి నా కంతగా తెలియదుగాని కామర్సు లెక్చరరు గనుక ట్యూషన్ల గిరాకీ తగల డంతో నెలకో వెయ్యిరూపాయలు కళ్ళ చూస్తున్నాడు. ఎంతోమంది ఆడపిల్లల తండ్రులు కాలేజీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా, కాదు పొమ్మనేవాడు సీతాపతి. ఆమధ్య ఎవరో ఇరవైవేలు, బజాజ్ ఇస్తామని వస్తే లాభంలేదు. పొమ్మన్నాట్ట. సీతాపతి తండ్రి శేషశాయిగారు నన్ను నచ్చజెప్పమన్నారు. బ్రాహ్మల్లో ఆ కట్నం చాలా యెక్కువట. శేషశాయిగారు పండు టాకు. కొడుకు నెత్తిమీద ఆ రెండక్షతలు వేస్తేగాని ప్రాణం సుఖంగా పోదని ఆయన బెంగ. సీతాపతిని నేను కదిపి చూశాను. అసలు కట్నం తీసుకోవడమే తన కిష్టంలేదు పొమ్మన్నాడు. అన్నట్టు, చెప్పడం మర్చిపోయాను. సీతాపతి అభ్యు దయ రచయిత. స్వంత పేరుతోనే పత్రికల్లో కథలూ అవీ రాస్తుంటాడు. ఆ మధ్య వరకట్నం మీద కూడా ఒకటీ రెండు రాశాడు. 'చూడు సీతాపతీ ఏ ప్రేమ కథలో రాసుకోక ఇలాంటి కథల జోలి కెందుకు వెళతావ్? ఆనక నీ వరకు వచ్చాక పాఠకులు సంజాయిషీ అడుగుతారు' అంటూ అప్పుడు నేను వేళాకోళం చేశాను. 'అప్పుడు చూద్దువుగానిలే' అనేవాడు. కాని అన్నంతపని చేస్తాడనుకోలేదు.

"కట్నం తీసుకోకపోతే పోయాడు. ఆ సుబ్బలక్ష్మి కంటె సుందరాంగి అతగాడి కంటి కగుపించలేదా?" ఇది చాలామంది అనుమానం "చావుంది. అతని కళ్ళతో చూడు సామెత చెప్పినట్టు తామెచ్చినది రంభ ..." అని కొంతమంది సరి పెట్టారు.

"అదేం కాదు నాయనా. సదరు సుబ్బ లక్ష్మి సిటీచోగారమ్మాయి. పైసా కట్నం ఇవ్వకపోయినా రాకిలో కబురంపితో సంసారానిక్కావాల్సిన సరంజామా అంతా బజారునుంచి వచ్చి కాళ్ళ దగ్గర పడు తుంది. ఈ రోజుల్లో అంతకంటె మహా భాగ్య మేముంటుంది? అంచేత సీతాపతిని




అండర్ ఎస్టిమేట్ చెయ్యకండి" అన్నాడో తలనెరిసిన సీనియర్ లెక్చరర్.

ఇంతలో ఓ రోజు అర్జంటుగా రమ్మని శేషశాయిగారు నాకు కబురంపారు. నేను వెళ్ళేటప్పటికి సీతాపతి లేడు. శేషశాయి గారు పడకకుర్చీలో శరీరాన్ని చేరేసి 'భగవద్గీత' చదువుకొంటున్నారు. నన్ను చూసి పుస్తకం మూసి 'రావోయ్, రా! నీకోసమే చూస్తున్నా' అంటూ కుర్చీ చూపించారు. నేను మాట్లాడకుండా బుద్ధిగా కూర్చున్నాను.

"వాసూ, ఓ స్నేహితుడు నీతో ఏదైనా చెప్పాడా?"

"దేని గురించండీ?" అన్నాను ఏవీ తెలియనట్టు.

"అదే. వాడి పెళ్ళి గురించి. ఆ సీటీవోగారమ్మాయి మీ కాలేజీలోనే చదువుతుందటగా. దాన్ని చేసుకుంటా నంటాడు."

"అలాగా? నాకు తెలియదండీ!" అన్నాను. కాలేజీ బెంచీలకూడా ఈ విషయం తెలిసిందని తెలిస్తే ముసిలాయన గుండె ఎక్కడాగిపోతుందోనని భయపడుతూ.

"ఆ అమ్మాయి ఎలా వుంటుందయ్యా?" అన్నారు కళ్ళజోడు తీసి కండువాతో తుడుస్తూ.

"బాగానే వుంటుందండీ!" అన్నాను ఏం చెపితే ఎటునుంచి ఎటు వస్తుందోనని.

"ఆహా! అందుకేనన్నమాట ఆ పిల్లనే చేసుకుంటానంటున్నాడు. ఆ సీటీవో వెంకటేశ్వర్రావు మావాడేలే! (అంటే వాళ్ళ కులంవాడే అని!) రెండుమూడు సార్లు పార్టీకని పిల్చి. వాడికి బాగానే వల

వెళాడు. వాడికి అయిదుగురాడపిల్లలు. ఈ సుబ్బలక్ష్మి నాలుగోది. ఇంతమంది ఆడపిల్లల్ని కన్నవాడు ఎంత గవర్న మెంటు సొమ్ము తింటే మాత్రం ఏం కట్నమివ్వగలడు చెప్పు. ఈ కుర్రనాగమ్మ మావగారేదో ఆఫీసరని మురిసిపోతు న్నాడు. వాడు పెళ్ళాడేది ఆయన్ను కాదు, ఆయన కూతుర్ని అనే విషయం మర్చిపోతున్నాడు. బోలెడు కట్నం ఇస్తా మని వస్తే కాదని ఈ బోడిసంబంధం చేసుకుంటానంటాడు. నా మాటలు వాడి కెక్కడంలేదు. నువ్వే ఎలా చెపుతావో చెప్పి ఈ సంబంధం కాదనిపించాలి." ముసలాయన ఆయాసపడుతూ అదేదో నా బాధ్యత అన్నట్టు ముగించాడు. 'సర్లెండి. చెప్పి చూస్తాను' అన్నాను. ఆయన మళ్ళీ మళ్ళీ నొక్కి చెప్పాడు. తలవూపి బయటపడ్డాను.

మధ్యన నేనెవర్ని అనుకుంటూనే కలగజేసుకున్నాను. ఓ సాయంకాలం పార్కులో కూర్చొని సీతాపతితో బాలా ఖానీ వేస్తున్నప్పుడు శేషశాయిగారి బాధ కొంత వివరించి 'సుబ్బలక్ష్మి అంటే నీ కెంతుకంత ఇష్టం?' అన్నాను. వాడిం తెత్తున లేచి 'ఏడిసినట్టుంది నీ ప్రశ్న. సౌరభములేల చిమ్ము పుష్పవ్రజమ్ము .' అంటూ కృష్ణశాస్త్రిగారి పద్యం చదవ బోయాడు. వాణ్ణి శాంతపరిచి 'అది కాదురా చిట్టితండ్రీ! ఆ సుబ్బలక్ష్మి పేరు బెంచీలవరకు కూడా ఎక్కింది' అన్నాను మెల్లగా సగం భావాన్ని మనసులోనే తొక్కేసి. 'అందమైన అమ్మాయిలందరికీ కాలేజీల్లో ఆ అదృష్టం తప్పదు' అన్నాడు సిగరెట్టు పొగని రింగులు రింగులుగా వదలి, వాటికేసి చూస్తూ. వాడికి ప్రేమ ముదిరి పిచ్చిపట్టింది అనుకున్నాను.


"అది సరే. సుబ్బలక్ష్మికి ఏదో నిక్ నేమ్ కూడా వున్నట్టుంది. నువ్వు పది కాలాలపాటు ఈ కాలేజీలో వుండేవాడివి గనుక ఈ కుర్రాళ్ళతో వేగడం కొంచెం కష్టమేమో ఆలోచించు" అన్నాను మరి కొంత సాహసించి.

'ఆ - మేరేజ్ అయిన తర్వాత కాలేజి మానేస్తుంది ఆ తర్వాత పాతబడిపోతుం దిలే' అన్నాడు. ఇక ఈ పెళ్ళి ఆపితే మహాపాపం చుట్టుకొంటుంది అను కున్నాను. ఆ తర్వాత సీతాపతి కోరిక మీద వాడి తరపున పెళ్ళి పెద్దగా సేటీవో గారింటికి వెళ్ళడానిక్కూడా అంగీకరిం చాను.

* * *

సేటీవోగారిల్లు కాలేజికి దగ్గరే. నడిచి వెళ్దామన్నాడు సీతాపతి. 'నువ్వు దుకీ అతి వినయం ప్రదర్శిస్తే మీ మావ పిల్ల నివ్వడు జాగ్రత్త' అని భయపెట్టి నా స్కూటరుమీద తీసుకెళ్ళాను. నన్ను విడిచిపెట్టి తండ్రినీ, కొడుకునీ వెళ్ళమని నేనెంత బతిమాలినా శేషశాయిగారు విని పించుకోలేదు. ఈ సంబంధం సెటిలు కావడం ఆయన కేమాత్రం ఇష్టంలేదు. కాని 'సుబ్బలక్ష్మిని కాదంటే మీ సీతాపతి మీకు దక్కడు' అని బంగారు గుడ్లు పెట్టే బాతునెందుకు నష్టపోతారు అన్న ధోరణిలో భయపెట్టేసరికి ముమ్మల్నిద్దర్ని వెళ్ళి సెటిలుచేసుకు రమ్మనేవరకు దిగారు శేష శాయిగారు. వీలయినంత ఎక్కువ కట్నం

ఒరిజినల్ కురుక్షేత్ర ప్రదర్శనం!




రాబట్టమని బయల్దేరేటప్పుడు నాతో మరీ మరీ చెప్పారు. సీతాపతి ఆయన్ని గట్టిగా రమ్మనమని అన్లేదనో ఏమో శేషశాయి గారు మాత్రం ససేమిరా రానన్నారు.

స్కూటరు ఆగీ ఆగగానే బంట్రోతు వచ్చి స్కూటరందుకొని నీడకు తీసుకెళ్ళి పార్క్ చేశాడు. సీటీవోగాడు బయటకొచ్చి విష్ చేసి లోనికి తీసుకెళ్ళారు. కూల్ డ్రింక్స్ తీసుకొంటుండగా సీతాపతి నన్ను పరిచయం చేశాడు.

'మిమ్మల్ని ఒకటి రెండు సార్లు చూశాను' అన్నారు వెంకటేశ్వర్రావు గారు.

'మిమ్మల్ని చూడలేదు. మీ గురించి విన్నాను' అన్నాన్నేను.

'గడుగ్గాయే' అన్నట్టు నావైపు చూశాడాయన. నేను మాత్రం కొత్త సోఫాసెట్టుని, కొత్త సినిమా పాటల్ని వినిపిస్తోన్న సరికొత్త టేప్ రికార్డర్నీ, ఖరీదయిన డోర్ కర్టెన్లనీ, డోర్ కర్టెన్ సందులోంచి కనిపిస్తున్న ఫ్రిజ్ ని పరిశీలనగా చూస్తున్నా.

నలుగురయిదుగురు చెప్పారు. సీటీవో గారు సతీసమేతంగా జీపుమీద బజార్లోకి వేటకు వెళుతుంటారట. అలా వేటలో కొల్లగొట్టుకొచ్చిన సరంజామా సంవత్సరానికోసారి లారీమీద స్వంత వూరికి తరలిస్తుంటారట. మాటల్లో వెంకటేశ్వర్రావుగారు సమాజంలో తన అంతస్థు గురించి, అల్లుళ్ళ ఉద్యోగాల గురించి, ఫారిన్లో వుంటున్న పెద్దల్లుడి గురించి ఏకధాటిన ఓ అరగంట చెప్పారు. పెళ్ళి కూతురు మాకు కొత్తది కాకపోయినా

సంప్రదాయం పేరుతో సుబ్బలక్ష్మిని పిలిచి చూపించారు. సుబ్బలక్ష్మి పెళ్ళి కూతురిగా నామట్టుకు నాకు కొత్తగా కనిపించింది. లేత నీలంరంగు లంగా జాకెట్టుమీద తెల్లటి వోణీలో క్లాసులో కంటె నాజూగ్గా కనిపించి 'ఫర్వాలేదు' అనిపించింది. ఆరిందాల చేతుల్లో మెలికలు తిరిగిపోతూ అడుగులు లెక్కెట్టుకొంటూ వచ్చే పెళ్ళికూతుర్లా కాకుండా తనంత తానుగా ముందుకొచ్చి చనువుగానే మాట్లాడింది.

సుబ్బలక్ష్మి లోనికి వెళ్ళిన తర్వాత అమ్మాయి నచ్చినట్టేగా అని లాంఛనంగా అడిగారు వెంకటేశ్వర్రావుగారు. సీతాపతి నవ్వుతూ తలూపాడు.

"చూడండి మాష్టారూ. సీతాపతి అడగ లేదనుకోండి.అయినా చెప్పడం నాధర్మం. ఉద్యోగస్థుల సంగతి మీకు తెలియం దేముంది? జీతం ఎన్ని వేలొచ్చినా మంచి నీళ్ళలా ఖర్చయిపోతుంది. పెద్దపిల్లలు ముగ్గురికీ పదేసి వేలిచ్చాను. అలాగే సుబ్బలక్ష్మికి కూడా . " ముగ్గులోకి దిగుతున్నాడు. నా కళ్ళముందు శేషశాయిగారు మెదిలాడు.

"అలా అనకండి. ఈ రెండేళ్ళలో అన్నిటి ధరలూ రెట్టింపయ్యాయి. అంచేత మరో అయిదయినా . "

సీటీవోగారు ఏదో అనబోయారు. అంతలోనే సీతాపతి అందుకున్నాడు.

"క్షమించండి. కట్నంగా నాకో పైసా కూడా తీసుకోవడం ఇష్టంలేదు."

వెంకటేశ్వర్రావుగారి మొహం నియాన్‌లైటులా వెలిగితే నా మొహం పవర్ షార్జేజికి డిమ్మయిన బల్బులా వుంది. 'మరి వాడు నన్నెందుకు తీసు కొచ్చినట్టు?' కొంచెం హర్టయ్యాను.

"మీరు వద్దన్నా మా అమ్మాయికి యథాశక్తి పెట్టుకోవడం మానుకొంటామా?" సీటీవోగారి శ్రీమతి అందుకొంది.

"అది మీ యిష్టం" అన్నాడు సీతాపతి. నేను అమ్మయ్య అనుకొన్నాను.

వెంకటేశ్వర్రావుగారు సిద్ధాంతిని పిలిపించి ముహూర్తం పెట్టించారు. సీతాపతికి ముహూర్తాలమీద నమ్మకం లేకపోయినా అవతలివాళ్ళను బాధపెట్టడం ఇష్టంలేక అంగీకరించాడట!


* * *

సీతాపతి పెళ్ళి నేననుకొన్నంత వైభవంగా జరగలేదు పెళ్ళికి సీతాపతి తరఫు ఫ్రెండ్సే ఎక్కువగా వచ్చారు. సీటీవో గారి పలుకుబడి ఇంతేనా అనుకున్నాను.

పెళ్ళయిన నాలుగయిదు రోజులకి అభ్యుదయ రచయిత సీతాపతి ఆదర్శ వివాహం గురించి పత్రికలు ఘనంగా ప్రచురించాయి. అవే పత్రికల్లో మరో వార్తకూడా పడింది. సీటీవో వెంకటేశ్వర్రావుగార్ని అవినీతి నేరారోపణపై సస్పెండు చేశారని.

నాలుగయిదు నెలలు గడిచేటప్పటికి

ఒరిజినల్ కురుక్షేత్ర ప్రదర్శనం!




సీతాపతికి సుబ్బలక్ష్మికి సరిగా పడ్డంలేదనే గుసగుసలు కాలేజీలో వినపడ్డాయి. కొత్త కాపురం కదా- ఆ మాత్రం చిటపటలు వుంటేనే అందం అనుకున్నాను.

పెళ్ళయి ఆర్నెల్లయిందో లేదో ఓ వుదయం మూర్తి హడావిడిగా వచ్చి ఓ వార్త చెప్పాడు—

సీతాపతి సుబ్బలక్ష్మికి విడాకులిస్తున్నాడని! నేను నమ్మలేదు. అంతకంటె నమ్మలేని నిజం మరొకటి చెప్పాడు మూర్తి.

'సీటీవోగారి ముగ్గురమ్మాయిల పెళ్ళిళ్ళకి వర్తకుల్నుంచి చదివింపుల రూపంలో యాభై అరవై వేలవరకు ముట్టేదట. అలా ముడుతుందనే సీతాపతి సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకున్నాడట. తీరా సీటీవో సస్పెండు అయిన సంగతి ముందుగనే తెలిసిన జనం ఎవరూ పెళ్ళికి హాజరు కాకపోవడంతో సీతాపతి ప్లాన్ తీన్‌తేరా అయింది. ఎమర్జెన్సీ పుణ్యమా అని అవినీతి పరులైన అధికారుల జాబితాలో వెంకటేశ్వరరావుగారి ఉద్యోగం వూడిపోయింది. చేసేదిలేక సుబ్బలక్ష్మిమీద తన కసినంతా చూపించాడు సీతాపతి. అతగాడు గొప్ప హిపోక్రైట్."

అదేరోజు కాలేజీలో కామర్సు స్టాఫ్ రూం గోడమీద మరో సరికొత్త శాసనం వెలిసింది—

'కాశీగుర్రం తన్నింది!' ***